సాక్షి
నిజామాబాద్
సోమవారం । 9 । జూన్ । 2025



మరమ్మతులు చేయరు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయ భవనాలు ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా ఉంటున్నాయి.

- 8లో ▸



శివాజీ స్ఫూర్తితో..

శివాజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని పిల్లలను పెంచాలని జాతీయ విద్యావిధానం రూపకల్పన కమిటీ సభ్యులు లక్ష్మణరావు అన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.8 /24.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలుంటాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నెలాఖరు వరకు రేషన్ బియ్యం పంపిణీ



అరవింద్‌రెడ్డి, డీఎస్‌వో

సుభాష్‌నగర్: ఈనెలాఖరు వరకు రేషన్ బియ్యం పంపిణీ చేపడుతామని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి (డీఎస్‌వో) అరవింద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా 15వ తేదీవరకు మాత్రమే అందించే రేషన్ సరుకుల పంపిణీ ఈనెల 30వ తేదీవరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో.. సాంకేతికంగా జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని, అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌బియ్యం పంపిణీ సాఫీగా జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎలుగుబంటి మృతి



ఇందల్వాయి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఎలుగుబంటి మృతి చెందింది. ఈ ఘటన ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సిబ్బంది ఎలుగుబంటి కళేబరాన్ని తిర్మన్‌పల్లి ఫారెస్ట్ సెంట్రల్ నర్సరీకి తరలించి డీఎఫ్‌వో వికాస్ మీనా ఆధ్వర్యంలో మండల పశు వైద్యాధికారి గంగాప్రసాద్ పోస్ట్‌మార్టం చేశారు. అనంతరం కళేబరాన్ని దహనం చేశారు. మృతి చెందిన మగ ఎలుగుబంటి వయస్సు మూడు సంవత్సరాలు ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో రవిమోహన్ భట్ తెలిపారు.

27న పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు



ఖలీల్‌వాడి: రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలకు నిజామాబాద్ ఆర్టీసీ ఒకటో డిపో నుంచి ఈనెల 27వ తేదీన తెల్లవారుజామున 5గంటలకు బస్సు బయల్దేరుతుందని మేనేజర్ ఆనంద్ తెలిపారు. నిజామాబాద్ నుంచి యాత్రికులతో బస్సు బయల్దేరుతుందని, ధర్పల్లిలో సైతం ప్రయాణికులు ఎక్కే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కామారెడ్డి, సిద్దిపేట మీదుగా యాదగిరిగుట్టకు 9గంటలకు బస్సు చేరుకుంటుందని, అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి స్వర్ణగిరిని సందర్శించడం జరుగుతుందన్నారు. వీలైతే సువర్ణపురిని సైతం సందర్శించి అటునుంచి ముచ్చింతల్ రావడం జరుగుతుందన్నారు. రామానుజుల విగ్రహాన్ని సాయంత్రం సందర్శించిన అనంతరం అక్కడి నుంచి బస్సు బయల్దేరి నిజామాబాద్‌కు అర్ధరాత్రి చేరుకుంటుందని తెలిపారు. ఈ స్పెషల్ బస్సులో మహాలక్ష్మి స్కీమ్ వర్తించదని, ఒక్కొరికి రూ.1400 చార్జి ఉంటుందని తెలిపారు. అడ్వాన్స్ రిజర్వేషన్ కోసం నిజామాబాద్ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో లేదా బస్ స్టేషన్ మేనేజర్‌ని సంప్రదించాలని సూచించారు.

అధ్వానంగా నిజాంసాగర్ ఉప కాలువలు



డి-10 కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు

బాన్సువాడ : నిజాంసాగర్ ఉపకాలువలు అధ్వానంగా మారాయి. కాలువల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, పూడిక పేరుకుపోయి సాగునీటి సరఫరాకు అడ్డుపడుతున్నాయి. సుమారు దశాబ్ద కాలంగా మరమ్మతులు లేకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం కష్టంగా మారింది. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద అత్యధికంగా బాన్సువాడ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. బాన్సువాడ నియోజకవర్గంలో డి–8 డిస్ట్రిబ్యూటర్ నుంచి ప్రారంభమై డి–39 డిస్ట్రిబ్యూటర్ వరకు ఉంటాయి. కాలువలను పట్టించుకునేవారు లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగాయి. గుర్రపుడెక్క వ్యాపించింది. బాన్సువాడ మండలంలో 10,968 ఎక రాలకు, బీర్కూర్ 9,431, నస్రుల్లాబాద్ 7,7 48, వర్ని 5,064, రుద్రూర్ 3,272, మోస్రా 566, చందూర్ 2,513, కోటగిరి 21,370 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. కాలువలకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



ఊరించి.. ఉసూరుమనిపించి

అప్పుడు.. ఇప్పుడు.. అంటూ మంత్రి వర్గ విస్తరణపై ఊరించిన కాంగ్రెస్ అధిష్టానం చివరకు ఉమ్మడి జిల్లాకు మొండిచేయి చూపింది. సీనియర్ అయిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి బెర్త్ ఖాయమని మొదటి నుంచి అంతా భావించినప్పటికీ ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం మంత్రి పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే మొదటికే మోసం అన్న చందంగా అసలు ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి దక్కలేదు. ఓ వైపు బీజేపీ బలపడుతుండగా.. మరో వైపు అసలు జిల్లాకు మంత్రి పదవి ఇవ్వడం లేదని కాంగ్రెస్ శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

- కేబినెట్ బెర్త్ కేటాయింపులో జిల్లాకు మొండి'చెయ్యి'
- సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోవడంతో శ్రేణుల గుర్రు
- నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు తాకిన సెగ
- మంత్రి లేని జిల్లాగా మిగిలిన ఉమ్మడి నిజామాబాద్!

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర కేబినెట్ విస్తరణ ఏడాదిన్నర తరువాత చేపట్టినప్పటికీ కేవలం ముగ్గురు మంత్రులతోనే సరిపెట్టడంతో జిల్లాకు మొండి'చెయ్యి' మిగిలింది. కేబినెట్‌లో ఆరు బెర్త్‌లు ఖాళీగా ఉండగా, కేవలం ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి, బోధన్ మాజీ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని ప్రతిఒక్కరూ భావించినప్పటికీ చివరకు నిరాశే మిగిలింది. దీంతో 18 నెలల పాటు ఊరించి.. ఉసూరుమనిపించినట్లైందని కాంగ్రెస్ శ్రేణులతోపాటు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 సీట్లకు గాను బీజేపీ మూడు చోట్ల, బీఆర్ఎస్ రెండు చోట్ల గెలిచాయి. కాంగ్రెస్ నాలుగు స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన నలుగురిలో ముగ్గురు ఎమ్మెల్యేలు మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. సీనియర్ అయిన సుదర్శన్‌రెడ్డికే కేబినెట్ బెర్త్ ఖాయమని ప్రతిఒక్కరూ భావించారు. మలివిడతలో వస్తుందని భావించడంతో సుదర్శన్‌రెడ్డి అనధికారిక మంత్రిగానే వ్యవహరిస్తూ వచ్చారు. అధికార యంత్రాంగం సైతం ఆయనను మంత్రిగానే భావిస్తూ రావడం గమనార్హం. ఈ క్రమంలో నిజామాబాద్ రూరల్ నుంచి గెలిచిన డాక్టర్ భూపతిరెడ్డి పేరు సైతం కేబినెట్ బెర్త్ కోసం పార్టీ హైకమాండ్ పరిశీలించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. మరోవైపు ఎల్లారెడ్డి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మదన్ మోహన్ సైతం కేబినెట్ బెర్త్ కోసం ఢిల్లీలో తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. జుక్కల్ నుంచి గెలుపొందిన లక్ష్మీకాంతారావు సైతం మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన నలుగురు ఎమ్మెల్యేలు కెబినెట్ పదవి ఆశించినప్పటికీ ఎవ్వరికీ కేటాయించకపోవడంతో ఉమ్మడి జిల్లాకు నిరాశే మిగిలింది.

రెడ్డికి దక్కని అవకాశం!

కేబినెట్ బెర్త్ కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గట్టిగా భీష్మించారు. తమకు మంత్రి పదవి కేటాయించకపోతే పార్టీకి రాజీనామా చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. వీరిద్దరూ రెడ్డి కులానికి చెందినవారు కావడంతో ఆ ప్రభావం సుదర్శన్‌రెడ్డి మీద పడింది. ఈ నేపథ్యంలో రెడ్డి కులానికి చెందిన వారికి ఈ విడతలో కేబినెట్ బెర్త్ కేటాయించలేదు. సుదర్శన్‌రెడ్డి సైతం ఇదే వర్గానికి చెందినవారు కావడంతో రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి సెగ ఇక్కడ తగిలింది. ఫలితంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రిపదవి దూరమైంది.

రంగారెడ్డి జిల్లాతో పాటు ఇందూరు జిల్లాకు మాత్రమే ప్రాతినిధ్యం కరువు..

తాజా కేబినెట్ విస్తరణ తరువాత రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరువాత ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మాత్రమే కేబినెట్‌లో బెర్త్ లేకుండా పోయింది. హైదరాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేలు గెలుపొందలేదు. ఉమ్మడి జిల్లాకు అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసినప్పటికీ, ఖర్చు పెట్టి పార్టీని పోషించినప్పటికీ అధికారంలోకి వచ్చాక మాత్రం ప్రభుత్వంలో జిల్లాకు స్థానం కల్పించకపోవడమేమిటంటూ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధినాయక్వం తీరుపై కార్యకర్తలు భగ్గుమంటున్నారు. కాగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి.. సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేశారు.

బీజేపీకి మరింత బలమిచ్చినట్లేనా..

ఉత్తర తెలంగాణలో ఇప్పటికే బీజేపీ బలోపేతమవుతోందని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆ పార్టీ మరింత శక్తిమంతంగా ఉందని.. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి కేటాయించకపోవడం బీజేపీకి బలాన్నిచ్చినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. అర్వింద్ ఎంపీగా వరుసగా రెండుసార్లు గెలుపొందడంతోపాటు ఉమ్మడి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు బీజేపీ తరుపున గెలుపొందారు. కామారెడ్డి నుంచి అయితే వెంకటరమణారెడ్డి ఏకంగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లను ఓడించి శాసనసభలో అడుగుపెట్టడం గమనార్హం. బీజేపీ రోజురోజుకూ బలపడుతున్న నేపథ్యంలో ఆ పార్టీని దీటుగా ఎదుర్కోవాల్సి ఉండగా.. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి కేటాయించలేదని కాంగ్రెస్ శ్రేణులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

అభివృద్ధి కుంటుపడుతుంది.. పార్టీకి నష్టం కలుగుతుంది



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవి లేకపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు రావాలంటే ప్రభుత్వంలో భాగస్వామ్యం తప్పనిసరి. నీటిపారుదల, బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తదితర ప్రాజెక్టులు పట్టాలెక్కాలంటే కేబినెట్ పదవి కచ్చితంగా అవసరం. పాలసీ మేకింగ్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిథ్యం తప్పనిసరి. మంత్రి లేకపోవడంతో జిల్లాకు అన్యాయం జరగడంతో పాటు పార్టీకి సైతం నష్టం కలుగుతుంది. జిల్లా నుంచి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటేనే జిల్లా అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతం అవుతుంది. పార్టీ నాయకత్వం ఈ అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. – డాక్టర్ భూపతిరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

మృగశిర సందడి



మృగశిర కార్తె రోజున చేపలు తినడం ఆనవాయితీ కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, అలాగే వీక్లీ బజార్‌లోని చేపల మార్కెట్ ఆదివారం కిటకిటలాడింది. వివిధ రకాల చేపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. చేపల మార్కెట్ సందడిగా మారింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కారుణ్యం చూపండి

- గృహనిర్మాణ సంస్థలో అవుట్ సోర్సింగ్‌లో ఉపాధి కల్పించాలంటున్న మరణించిన ఉద్యోగుల కుటుంబీకులు
- 2016 నుంచి పోరాటం చేస్తున్న 88 మంది
- అవకాశం ఇవ్వాలని 2019లో ఆదేశించిన హైకోర్టు
- తాజాగా 390 మంది అవుట్‌సోర్సింగ్‌లో నియామకం
- మరణించిన ఉద్యోగుల కుటుంబాలను మాత్రం పట్టించుకోని ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర గృహనిర్మాణ సంస్థలో ఉద్యోగాలు చేస్తూ అనారోగ్య కారణాలతో, దురదృష్టవశాత్తు ప్రమాదాల కారణంగా మరణించినవారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు తమకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. కారుణ్య నియామకాల కింద తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 88 మంది మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తమకు ఉపాధి కల్పించాలని, ఇళ్లు గడవక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నిరకాల విద్యార్హతలు ఉన్నప్పటికీ తమకు అవకాశం కల్పించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ 2016 నుంచి పోరాటం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, మంత్రుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినప్పటికీ ఫలితం లేదని వాపోతున్నారు. అయితే కొందరు మరణించిన ఉద్యోగుల స్థానంలో కొందరు 2008 నుంచి 2016 వరకు పనిచేసినవారున్నారు. ఇలా పనిచేస్తున్న వారిని కూడా 2016 మార్చిలో ప్రభుత్వం తొలగించింది. విద్యార్హతలు ఉన్నవారిని కూడా తొలగించినట్లు ఆయా కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా వీరిని కారుణ్యం కింద పరిగణనలోకి తీసుకుని అవకాశాలు కల్పించాలని 2012లో అప్పటి గృహనిర్మాణ సంస్థ ఎండీ ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు హైకోర్టు 2019లో ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ తమకు అవకాశాలు ఇవ్వలేదని కారుణ్య నియమాకాలు ఆశిస్తున్నవారు చెబుతున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో తమకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

■ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గృహనిర్మాణ సంస్థ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల అవసరం ఉంది. ప్రస్తుతం గృహనిర్మాణ సంస్థలో చాలామంది

రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 390 మందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియామకాలు చేసుకుంది. అయితే ఈ నియామకాల్లో తమకు అవకాశాలు కల్పించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదని కారుణ్య నియామకాల కోసం ఆశిస్తున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం చేయాలి..



గృహనిర్మాణ సంస్థలో కారుణ్య విధానంలో కేవలం అవుట్ సోర్సింగ్ నియామకాలు కల్పించాలని మాత్రమే కోరుతున్నాం. ఉన్న 88 మందిలో కుటుంబం గడవలేనివారు ఎక్కువగా ఉన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ గతంలో అనేకసార్లు గృహనిర్మాణ సంస్థ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు.

– పగిడిపల్లి రామకృష్ణ, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

కళాభారతిలో ఆమని సందడి

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి కూచిపూడి కళాక్షేత్రం వార్షికోత్సవాలను ఆదివారం జిల్లాకేంద్రంలోని కళాభారతి స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ కుటుంబ సమేతంగా హాజరు కాగా.. సినీనటి ఆమని, టీవీ నటుడు ప్రభాకర్ ఉత్సవాలలో పాల్గొన్నారు. 15 హిట్‌సాంగ్స్‌లతో కూడిన నృత్య రూపకంలో కళాకారులతో కలిసి ఆమని, ప్రభాకర్ నృత్యం చేశారు. కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపకుడు, జాతీయ నృత్య కళాకారుడు వంశీప్రతాప్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న సినీనటి ఆమని, టీవీ నటుడు ప్రభాకర్, కళాకారులు

5 గ్రాముల టీ పొడి.. 140 మి.లీ. టీ





నిజాం నిర్మించిన ఖిల్లా జైలు ఎన్నో చారిత్రక ఘటనలకు కేరాఫ్ అడ్రస్. సారంగాపూర్ ప్రాంతంలో నూతన జైలు నిర్మాణం తరువాత ఖైదీలను అక్కడికి తరలించారు. ప్రస్తుతం జైలు అక్కడే కొనసాగుతుండగా.. ఖిల్లా జైలు మాత్రం నాటి జ్ఞాపకాలకు చిహ్నంగా నిలిచింది. ప్రాంగణంతో పాటు గదులు శిథిలావస్థకు చేరగా, జైలు కొనసాగిన కాలంలో ఏర్పాటు చేసిన బోర్డులు, ఖైదీలకు అందించే మెనూ వివరాలు పాతగోడలపై ఇలా కనిపించాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బాలల డ్రైవింగ్‌కు బాధ్యులు మీరే..

- మైనర్ డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి
- జిల్లాలో స్పెషల్ డ్రైవ్
- బాధ్యులకు జరిమానాలు.. కౌన్సెలింగ్
- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నా ఇంకా కనిపించని మార్పు
- సీపీ ఆదేశాలతో ప్రధాన కూడళ్లలో ఫ్లకార్డులతో ప్రదర్శన

ఖలీల్‌వాడి: ''సార్ నమస్తే.. నిన్న మీ అబ్బాయి సిటీలోని రోడ్డుపై బైక్ నడుపుతున్నాడు. మీ అబ్బాయి ఇప్పుడు టెన్త్ క్లాసే కదా సార్.. ఇప్పటి నుంచి అలా బైక్ నడపటం అవసరమంటారా..!?' అని ప్రదీప్ అంటుండగానే.. అరె ఏం సార్.. మీరింకా ఏ జమానాలో ఉన్నారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్‌ల జమానా నడుస్తోంది. పిల్లలు అన్నింట్లో ఫాస్ట్‌గా ఉండాలి. ఇప్పటి నుంచే అన్నీ నేర్చుకోవాలి. వయస్సుదేముంది సార్..!? వాడు బైక్ బాగానే నడుపుతాడు. స్కూల్‌కి ఎండాకాలం సెలవులు వచ్చినప్పటి నుంచి ఏ పని ఉన్నా.. వాడికే చెబుతున్నాం..' అంటూ నాగేందర్ చెబుతుండడంతో ప్రదీప్ సైలెంట్ అయిపోయాడు. సరిగ్గా 10 రోజుల తర్వాత జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నాగేందర్ కనిపించడంతో ప్రదీప్.. ఏమైందంటూ.. నాగేందర్‌ను పలకరించాడు. తమ అబ్బాయి బండి నడుపుతూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడని, బాబుకు కుడికాలు విరిగిపోయిందని, బైక్ వెనుక కూర్చున్న మరో బాబు తీవ్రంగా గాయపడ్డాడని చెప్పాడు. బాబుకు బైక్ ఇచ్చినందుకు పోలీసులు తనపై కేసు నమోదు చేశారని తలదించుకున్నాడు.



సోషల్ సర్వీస్‌లో భాగంగా ఎన్టీఆర్ చౌరస్తాలో ఫ్లకార్డు పట్టుకుని నిల్చున్న మైనర్ (ఫైల్)

ప్రాణాలు పోయిన ఘటనలెన్నో..

మైనర్లు బైక్‌లు నడిపి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలెన్నో ఉన్నాయి. ఆలోచన పరంగా పరిపక్వత లేని మైనర్లు ఇష్టారీతిన బైక్‌లు నడుపుతూ ప్రాణాల మీదుకు తెచ్చుకుంటున్నారు. పిల్లలు బైక్‌లు నడిపితే సంబురపడుతున్న తల్లిదండ్రుల కళ్ల ముందే వారి పిల్లలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరికొన్ని ఘటనల్లో ఎదుటి వారి ప్రాణాలు పోయేలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై ఇటీవల పోలీస్ శాఖ సీరియస్‌గా దృష్టి సారించింది.

స్పెషల్ డ్రైవ్.. అవగాహన

సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకుని బైక్‌లను పోలీస్‌స్టేషన్‌లకు తరలిస్తున్నారు. ఆ తరువాత మైనర్‌లతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇది నిరంతర ప్రక్రియగా సాగుతోంది. నిజామాబాద్ నగరంలోని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి కేసులు నమోదు చేసి, జువైనల్ జస్టిస్ ముందు హాజరుపరుస్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు విధిస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు

- మైనర్లు వాహనాలు నడిపితే మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 180, 183, 184 ప్రకారం కేసులు నమోదు చేస్తారు.
- డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లకు రూ.2500 జరిమానాను ఈ ఏడాది ఏప్రిల్ వరకు విధించారు. ఏప్రిల్ 24 నుంచి జీరో చలాన్ జనరేట్ చేసి, పెట్టీ కేసులు పెట్టి జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తున్నారు. అక్కడే జరిమానా, శిక్షలు ఉంటాయి.
- జువైనల్ జస్టిస్ బోర్డుకు పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత మైనర్లు నడిపిన వాహనం యజమానికి లేదా తల్లిదండ్రులకు రూ.25 వేల జరిమానా విధిస్తారు.
- మైనర్లు వాహనం నడిపి ప్రమాదానికి గురైతే ఆ వాహనం ఆర్‌సీని ఏడాది పాటు రద్దు చేస్తారు.
- ప్రమాదాలకు కారణమైన మైనర్లకు 25 ఏళ్లు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వరు. ప్రమాద తీవ్రతను బట్టి మూడు వారాలపాటు జైలు శిక్ష, స్టేట్ హోంకు తరలించే అవకాశం ఉంటుంది.
- గతంలో 16 ఏళ్లు నిండిన వారికి 50 సీసీ కన్నా తక్కువ ఉన్న వాహనాలను నడిపేందుకు ఆర్టీఏ అధికారులు లైసెన్స్ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు 100 సీసీ వాహనాలు ఉండటంతో 18 ఏండ్లు నిండిన తర్వాతే లైసెన్స్ ఇస్తున్నారు.

నిజామాబాద్ నగరంలో నమోదైన కేసులు

నిజామాబాద్ నగరంలో జనవరి నుంచి జూన్ 3 వరకు 341 కేసులు నమోదయ్యాయి. జనవరి 1 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు 152 కేసులు కాగా జరిమానాలు విధించారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు 189 మంది మైనర్లపై పెట్టీ కేసులు నమోదు చేశారు. ఇందులో 104 మందిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపర్చగా 11 మందికి జరిమానా విధించారు. 93 మంది వారం రోజుల పాటు సోషల్ సర్వీస్ చేయాలని తీర్పు ఇచ్చారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



మైనర్లకు వాహనాలు ఇస్తే పెట్టీ కేసులు నమోదు చేస్తాం. జువైనల్ జస్టిస్ బోర్డులో చార్జిషీట్ వేస్తాం. న్యాయమూర్తి తీర్పు మేరకు జరిమానాలు, శిక్షలు ఉంటాయి. ఇది ఏప్రిల్ 24వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు.. ఇస్తే ప్రమాదాలు జరుగుతాయి. దీనిని దృష్టిలో పెట్టుకోవాలి. మైనర్ డ్రైవింగ్ పిల్లల, ఎదుటి వారి ప్రాణాల మీదకు తెస్తుంది. – ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

క్లుప్తంగా

కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలో పోలీస్ కానిస్టేబుల్‌పై ఓ యువకుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలైనట్లు తెలిసింది. వివరాలు ఇలా.. బాబాన్ సాహెబ్ పహాడ్‌లో ఇర్ఫాన్ అనే వ్యక్తి బైక్‌పై శనివారం రాత్రి స్పీడ్‌గా వెళ్లడంతో టాస్కోర్స్ పోలీసులు ఆపేందుకు యత్నించారు. కానీ సదరు వ్యక్తి బైక్ ఆపకపోవడంతో పోలీసులు వెంబండించి, పట్టుకున్నారు. అనంతరం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఇర్ఫాన్ పోలీసులపై కత్తితో దాడి చేశారు. ఈఘటనలో కానిస్టేబుల్‌కు కు గాయాలైనట్లు తెలిసింది. దాడి చేసిన వ్యక్తిపై ఇదివరకే పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్డును బాగు చేయించండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లే రోడ్డును బాగు చేయించాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. తాడ్వాయి–చందాపూర్ రహదారి నుంచి హాస్టల్ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారై గుంతలమయంగా మారిందన్నారు. దీంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లలపై ఏర్పడిన గుంతలను పూడ్చి సీసీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగు పనుల్లో రైతన్న బిజీ



మద్నూర్(జుక్కల్): వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో మండలంలోని రైతులు ముందుగానే సాగుకు సమాయత్తం అవుతున్నారు. రైతులు తమ చేలను శుభ్రం చేసుకుంటున్నారు. మరికొందరు రైతులు చెరువుమట్టి, పశువులు, కోడి ఎరువులు చేలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది కష్ట, నష్టాలు లేకుండా వ్యవసాయం సాగాలని దేవుళ్లకు కోరుకుంటున్నారు. మండలంలో గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను చేపట్టేందుకు వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేసుకుంటున్నారు. గట్టిగా రెండు వానాలు పడగానే విత్తనాలు వేసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మరమ్మతులు చేయరు.. వినియోగించరు

- ఏళ్లుగా ఖాళీగా ఉంటున్న ఎస్సారెస్పీ కార్యాలయ భవనాలు
- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్ట్ కార్యాలయాల భవనాలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయ భవనా లు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటున్నాయి. ఆ భవనాలకు మరమ్మతులు లేకపోవడం , ఉపయోగించకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు తరలింపు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఏటా ఒక సబ్ డివిజన్ ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. అంతేకాకుండ ముంపు గ్రామాల సమస్యల కోసం స్పెషల్ కలెక్టర్ కార్యాలయం కూడ నిర్మించారు. ప్రస్తుతం స్పెషల్ కలెక్టర్ వ్యవస్థనే ఇక్కడ లేకుండా చేశారు. ప్రాణహిత చెవెళ్ల నిర్మాణం కోసం సబ్ డివిజన్– 4 నిజామాబాద్, క్వాలిటీ కంట్రోల్ విభాగం నిర్మల్‌కు, లక్ష్మి కాలువ నిర్వహణ కార్యాలయం బాల్కొండకు, సరస్వతి కాలువ నిర్వహణ కార్యాలయం నిర్మల్‌కు తరలిపోయాయి. దీంతో ప్రాజెక్ట్ వద్ద ఉన్న కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. బహుళ అంతస్తుల భవనాలు కూడ నిరుపయోగంగా ఉన్నాయి.

విద్యాసంస్థలకు కేటాయిస్తే మేలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద బాలికల, బాలుర గురుకులాలు, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అందులో బాలుర, బాలికల గురుకులాలను ఆరేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేస్తు ఇంటర్మీడియట్ ఏర్పాటు చేశారు. కానీ భవనాలను నిర్మించలేదు. ఇరుకు గదుల్లో, చెట్ల కింద చదువులు నేర్పుతున్నారు. ఆ గురుకులాల కళాశాలల కోసం నిరుపయోగంగా ఉన్న భవనాలను కేటాయించవచ్చు. కానీ అటువైపుగా ఎవరు ఆలోచన చేయడం లేదు. పక్కా భవనాలు కావడంతో కొంతమేర మరమ్మతులు చేపడితే వినియోగించుకోవచ్చు. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురావాడానికి పాలకులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం విద్యా సంస్థల నిర్వహణ కోసం ఈ కార్యాలయాల భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమీకృత పాఠశాల ఏర్పాటు చేయాలి

ఎస్సారెస్పీలో నిరుపయోగంగా ఉన్న కార్యాలయాల్లో సమీకృత పాఠశాలను ఏర్పాటు చేయాలి. విద్యా సంస్థలకు ఆ భవనాలను కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పాలకులు వెంటనే స్పందించాలి.

– నర్సింగ్‌రావు, రిటైర్డ్ పీడీ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ప్రాజెక్ట్ కార్యాలయాల భవనాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని ఇతర సంస్థలకు అప్పగించే విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వాటి నిర్వహణకు కూడ ఎలాంటి నిధులు రావడం లేదు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

ఆలయం పేరే ఊరు పేరైంది

మీకు తెలుసా?



బండరామేశ్వర్‌పల్లిలో బండరాళ్లతో నిర్మించిన రామనాథ ఆలయం

పాల్వంచ మండలం బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో క్రీ.శ. 1264లో కాకతీయ సామ్రాజ్య విస్తరణలో భాగంగా రాణి రుద్రమదేవి అక్కడ గుండయ్య అనే సామంతుడిని నియమించి బండరాళ్లతో రామనాథుని ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయంపై ఉన్న శిలాశాసనం చెబుతోంది. భక్తులు రానురాను రామనాథున్ని రామలింగేశునిగా, రాజరాజేశ్వర స్వామిగా కొలుస్తున్నారు. బండరాళ్లతో ఆలయాన్ని నిర్మించినప్పటి నుంచి గ్రామానికి బండరామేశ్వర్‌పల్లి అనే పేరు వచ్చినట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

– మాచారెడ్డి

ఉత్తర తెలంగాణ వరప్రదాయని ఎస్సారెస్పీ

సమాచారం..



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

బాల్కొండ: మండలంలోని పోచంపాడ్ సమీపంలో 1963 జూలై 26న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌నిర్మాణం కోసం దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు.

- ప్రాజెక్ట్ నిర్మాణ పనులు 1978 వరకు పూర్తయ్యాయి.
- ప్రాజెక్ట్ నీటిమట్టం 1091 అడుగులు కాగా 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. కాని పూడిక వలన ప్రస్తుతం 80.5 టీఎంసీలకు నీల్వ సామర్థ్యం పడిపోయింది.
- ప్రాజెక్ట్ ప్రధాన కాలువలుగా కాకతీయ, సరస్వతి, లక్ష్మి ఉన్నాయి. 2010 తరువాత వరద కాలువ ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది.
- 1978లోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందారెడ్డి ప్రాజెక్ట్ నుంచి తొలిసారి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్ట్ ద్వారా 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నారు.
- ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, నిర్మల్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ జిల్లాల ఆయకట్టుకు నీరు అందిస్తారు.

'పందిరి' సాగు.. లాభాలు బాగు..

- ఈ విధానంలో కూరగాయలు పండిస్తే అధిక దిగుబడి
- ప్రభుత్వం సబ్సిడీ సైతం అందిస్తుందంటున్న అధికారులు



రుద్ర వినాయక్..

బాల్కొండ: పందిరి విధానంలో కూరగాయాలు సాగు చేయడం వల్ల లాభాలు బాగా ఉంటాయని ఆర్మూర్ డివిజన్ ఉద్యానవన అధికారి రుద్ర వినాయక్ అంటున్నారు. పందిరి విధానంపై ప్రభుత్వం (ఆర్‌కేవీవై) రాష్ట్రీ య కృషి వికాస్ యోజన కింది సబ్సిడీ సైతం అందిస్తుందంటున్నారు. సాధారణంగా ఎకరం భూమిలో శాశ్వత పందిరి నిర్మించుకోవాడానికి రైతులకు సుమారుగా రూ. లక్ష ముప్పై వేల నుంచి రూ. లక్షన్నర వరకు ఖర్చు అవుతుంది. ఉద్యానవన శాఖ ఎకరానికి రూ. 50వేలు సబ్సిడీ ఇస్తుంది. అలాగే ఉద్యానవన శాఖ జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి నాణ్యమైన కూరగాయాల నారు కోసం ఎకరానికి రూ6, 400 సబ్సిడీ ఇస్తుంది. ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు వినియోగించుకొని, కూరగాయల సాగుపై దృష్టిసారించాలని అధికారులు సూచిస్తున్నారు.



రైతు సమాచారం

ప్రయోజనాలు ఇలా..

- పందిరి వ్యవస్థలో ప్రధానంగా తీగ జాతి (కాకర, సోర కాయ, టమాట, చిక్కుడు, బీర) లాంటి కురగాయాలను సాగు చేసుకోవాలి.
- సాధారణ పద్ధతి కంటే పందిరి పద్ధతిలో కూరగాయాలు సాగు చేసుకుంటే 2.5 టన్నుల అదనపు దిగుబడి వస్తుంది.
- పండు యొక్క రంగు, నాణ్యత మెరుగు పడుతుంది. ఐదు ఎకరాల భూమిలో వరి సాగు చేసే బదులు ఎకరం భూమిలో కూరగాయాలు సాగు చేస్తే అంతే ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సత్తాచాటిన 'రెంజల్' విద్యార్థులు

- ఎన్‌ఎంఎంఎస్‌కు అత్యధికంగా 17 మంది ఎంపిక
- జిల్లావ్యాప్తంగా అర్హత సాధించిన 129 మంది



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో రెంజల్ హైస్కూల్ ఉపాధ్యాయుల విజయ సంకేతం

రెంజల్(బోధన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో రెంజల్ విద్యార్థులు సత్తాచాటారు. జిల్లాలోనే అత్యధికంగా రెంజల్ మండలం నుంచి 17మంది ఎంపికయ్యారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తు వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలను ప్రతీ సంవత్సరం నవంబర్ నెలలో నిర్వహిస్తుంది. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో నిజామాబాద్ జిల్లా నుంయి 129 మంది విద్యార్థులు అర్హత సాధించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే ఈ అర్హత పరీక్షల్లో ఎంపికైతే 4 సంవత్సరాల పాటు వారి ఖాతాల్లో నెలకు రూ. వెయ్యి చొప్పున, సంవత్సరానికి రూ. 12వేలను వారి ఖాతాల్లో జమ చేస్తారు.

ఎంపిక విధానం ఇలా:

పరీక్షల్లో సాధించిన మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఉపకార వేతనాలకు ఎంపిక చేస్తారు. జిల్లా యూనిట్‌గా కేటగిరీలా వారీగా అర్హుల ఎంపిక నిర్వహిస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కేంద్రం నుంచి వచ్చిన జాబితా ఆధారంగా ఏఏ మండలం నుంచి ఎంత మంది ఎంపికయ్యారనేది గుర్తిస్తారు. ప్రతి సంవత్సరం ఆర్మూర్ మండలం నుంచి అత్యధికంగా విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధిస్తారు. ఈసారి రెంజల్ మండలం నుంచి అత్యధికంగా విద్యార్థులు అర్హత సాధించారు.

ప్రత్యేక తరగతుల ఫలితం



ప్రత్యేక తరగతుల ఫలితంగానే విద్యార్థులు అర్హత సాధించారు. పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంది.అలాగే సాధించాలనే పట్టుదల విద్యార్థుల్లో ఉండటం వల్లే మంచి ఫలితాలు వచ్చాయి. రెంజల్ హైస్కూల్ నుంచి 10 మంది, మోడల్ పాఠశాల నుంచి ఆరుగురు, మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి ఒకరు అర్హత సాధించారు. – ఆంజనేయులు, రెంజల్ హైస్కూల్ హెచ్‌ఎం, ఎంఈవో

సద్వినియోగం చేసుకుంటా..



ఉపాధ్యాయులు ప్రతీరోజు నిర్వహించిన ప్రత్యేక తరగతులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించడానికి ఎంతో దోహదపడ్డాయి. ఉపకార వేతనానికి ఎంపికై తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలని పట్టుదలతో చదివాను. ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికవడంతో, స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులకు సిద్ధమవుతాను.

– గగన్‌కుమార్, రెంజల్ హైస్కూల్ విద్యార్థి

వల్లభాపూర్ వాసికి అమెరికాలో ఫ్రీ సీటు

- పోటీపరీక్షలో ప్రతిభచాటి వైద్యవిద్య కోర్సుకు ఎంపికైన కేశెట్టి చరణ్‌సిద్ధార్థ్

మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన కౌెట్టి చరణ్ సిద్ధార్థ్ అమెరికాలో యూఎస్‌ఎంఎల్‌ఈ కోర్సులో ఫ్రీసీటు సాధించాడు. వల్లభాపూర్‌లో వ్యవసాయం చేసుకుంటూ జీవించే కౌెట్టి సూర్యప్రకాష్–వనజల ఏకైక కుమారుడు చరణ్ సిద్ధార్థ్. తల్లిదండ్రులు పట్టభద్రులైనప్పటికీ వ్యవసాయం మీద ఉన్న ప్రేమతో గ్రామంలోనే జీవిస్తుండగా, కుమారుడిని మాత్రం వైద్యుడిని చేయాలనే లక్ష్యంతో చదివిస్తున్నారు. సిద్ధార్థ్ ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేయగా, యూఎస్‌ఎంఎల్‌ఈ కోర్సుకుగాను పోటీ పరీక్షలో అత్యాధిక మార్కులు సాధించి ఫ్రీ సీటు పొందారు. మూడేళ్లపాటు ఉండే ఈ కోర్సుకు గ్రాంటు మొత్తాన్ని అమెరికా ప్రభుత్వమే భరిస్తుంది. సంవత్సరానికి 80 వేల డాలర్లు అక్కడి ప్రభుత్వం నుంచి గ్రాంటు వస్తున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది..



నన్ను డాక్టర్ చేయటానికి నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారు. వారి కోరిక మేరకు పెద్ద డాక్టర్ అయ్యాక, వారి ఆశయాలకు అనుగుణంగా పేదోళ్లకు ఉచిత వైద్య సేవలు అందించటంలో ముందుంటాను. –కౌెట్టి చరణ్ సిద్ధార్థ్, వల్లభాపూర్

క్రైం కార్నర్

సూపర్ మార్కెట్‌లో చోరీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాయి చైతన్య సూపర్‌మార్కెట్‌లో గుర్తుతెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. దుకాణం షెటర్‌ను లేపి లోనికి ప్రవేశించిన దుండగులు దుకాణంలోని వస్తువులతో పాటు సుమారు రూ. 80వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.

సంతలో సెల్‌ఫోన్లు..

భిక్కనూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన వారంతపు సంతలో గుర్తుతెలియని దుండగులు ఐదుగురి సెల్‌ఫోన్లను చోరీచేశారు. దీంతో బాధితులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఒక బాలుడు సెల్‌ఫోన్‌ను ఎత్తుకుని వెళ్తుండగా స్థానికులు అతడివెంటపడ్డారు. కానీ సదరు బాలుడు చిక్కకుండ పారిపోయాడు. గతంలో కూడా సెల్‌ఫోన్ల చోరీలు జరగడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో సంతలో చోరీల నివారణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాబా హోటల్‌లో మందుబాబుల హల్‌చల్



ఖలీల్‌వాడి: నగరంలోని సారం గాపూర్ కమాన్ సమీపంలోని ఓ దాబా హోటల్ వద్ద శనివారం అర్ధరాత్రి మందుబాబులు హల్‌చల్ చేశారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు బిర్యానీ కావాలని హోటల్ నిర్వాహకులతో గొడవకు దిగారు. పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని రెండు వర్గాలను వెళ్లగొట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన మున్నూరు శోభ అలియాస్ సంధ్య అదృశ్యమైనట్లు ఎస్సై రామ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 7న ఆమె ఎలాంటి కారణం లేకుండానే ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని, ఇప్పటికీ తిరిగిరాలేదన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె భర్త మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో వృద్ధుడు..



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆజాంపూర కాలనీకి చెందిన 65 ఏళ్ల మహమ్మద్ యాసిన్‌ఖాన్ అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 7న ఉదయం అతడు ఇంటి నుంచి తన స్కూటీపై బయటకు వెళ్లిపోయి, ఇప్పటికీ తిరిగిరాలేదు. ఆదివారం ఉదయం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద స్కూటీ లభ్యమవగా, కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే పట్టణ పోలీస్ స్టేషన్‌లోగానీ, 8712686145, 8712666242 నంబర్లకు సంప్రదించాలన్నారు.

తాడ్వాయిలో వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పొల్యూషన్, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. అలాగే పెండింగ్‌లో చాలనులు ఉన్న వాహనాలకు ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



పిట్ల మీన (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏర్గట్ల మాజీ సర్పంచ్ పిట్ల మీన (48) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఏర్గట్లకు చెందిన మీనా తన సోదరుడితో కలిసి బైక్‌పై మోర్తాడ్ నుంచి ఏర్గట్లకు బయలుదేరింది. తిమ్మాపూర్ శివారులో వీరి బైక్‌కు కుక్క అడ్డు రావడంతో, దానిని తప్పించబోయేక్రమంలో బైక్ అదుపుతప్పి మీనా, ఆమె సోదరుడు కిందపడిపోయారు. ఈఘటనలో మీనా తలకు తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మరణించారు. సమాచారం అందుకున్న ఎస్సై విక్రమ్ ఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏర్గట్లలో విషాదఛాయలు...

తమ గ్రామానికి సర్పంచ్‌గా పని చేసిన మీనా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఏర్గట్లవాసులు తీవ్ర విషాదం వ్యక్తం చేస్తున్నారు. అందరితో కలువుగోలుగా ఉండే ఆమె మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం గ్రామంలో మీనా మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ విద్యార్థి..

మాక్లూర్: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ పాలిటెక్నిక్ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. నిర్మల్ జిల్లా నరసాపురంనకు చెందిన సిందే శివకుమార్(17) నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో పలు సబ్జెక్టులు ఫెయిల్ అతడిని తండ్రి మందలించాడు. ఈ నెల 6న సెమిస్టర్ పరీక్షలు రాయడానికి నిజామాబాద్ వచ్చి, మాక్లూర్ మండలం దాస్‌నగర్ శివారులో గడ్డి మందు తాగి హాస్టల్‌కు వెళ్లాడు. అక్కడ వాంతులు చేసుకోవటంతో తోటి స్నేహితులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

సాహిత్యంలో రాణిస్తున్న దేగల వైష్ణవి



మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తడపాకల్ ఉన్నత పాఠశాలకు చెందిన దేగల వైష్ణవి తెలుగు సాహిత్యంలో రాణిస్తుంది. ఏడో తరగతి నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న వైష్ణవి కథలు, కవితలు, పద్యాలను రాసి విమర్శకుల ప్రశంసలను అందుకున్నారు. అమ్మ అనే వచనా శతకం, చిన్నారి కథలు అనే శీర్షిక పేరిట పుస్తకం రాసింది. సామాజిక ఇతివృత్తంతో రాసిన కథలు ఎంతో మందిని మెప్పించాయి. వైష్ణవి రాసిన కథల పుస్తకాన్ని ఇటీవల కలెక్టర్ ఆవిష్కరించగా, చదువు అనే సరళ వచనా శతకం పుస్తకాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ఇతర ప్రముఖులు ఆవిష్కరించారు. వైష్ణవి అక్షరయాన్ బాలికా పురస్కారం, పెందోట సాహిత్య పురస్కారం, బాలజ్యోతి, తానా పురస్కారాలను అందుకుంది. ప్రస్తుతం ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా ప్రేరణ అనే కథల పుస్తకాని రచించానని, త్వరలోనే ఆవిష్కరించనున్నట్లు వైష్ణవి వెల్లడించారు. వైద్య విద్యను అభ్యసించి పేదలకు సేవ చేయడమే తన ధ్యేయం అని ఈ చిన్నారి సాహితీవేత్త వెల్లడించడం గమనార్హం.

కామారెడ్డి శివారులో ట్రాలీ ఆటో- బైక్ ఢీ

- ముగ్గురికి గాయాలు



కామారెడ్డి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పోచవ్వ

కామారెడ్డి టౌన్: పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణ శివారులోని శాబ్దిపూర్ రోడ్‌లో ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న రెడ్డిపేట గ్రామానికి చెందిన పోచవ్వ, నరేష్‌లకు, ఆటో నడుపుతున్న డ్రైవర్ ఓబుది సాయిలుకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవీపేట మండలంలో..



నవీపేట: మండలంలోని యంచ శివారులోని బాసర బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. రాథోడ్ విజయ్, రాథోడ్ రాజు బైక్‌పై బాసర్ నుంచి ఫకీరాబాద్ వైపు బయలుదేరగా, యంచ శివారులోని బ్రిడ్జి సమీంలో వారిని మరో బైక్ ఢీకొట్టింది. ఈఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాయ్యాయి. మరో బైక్ నడిపిస్తున్న బాధితుడిని ధర్మాబాద్ వాస్తవ్యుడిగా స్థానికులు గుర్తించారు. క్షతగాత్రులను స్థానికులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

తండ్రీకొడుకుల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ తండ్రి మృతి
- విషమంగా కుమారుడి పరిస్థితి

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రి మృతిచెందినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన తండ్రి ఆకుల సాయిలు (74), అతని చిన్న కుమారుడు ఆకుల సతీష్ కలిసి ఈనెల 6న వారి ఇంట్లోనే విషగులికలు నీటిలో కలుపుకుని ఆత్మహత్యకు యత్నించారు. దీంతో ఇద్దరికి ఒకేసారి వాంతులు కావటంతో పెద్ద కుమారడు ఆకుల సంతోష్ వారిని చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్సపొందుతూ తండ్రి ఆదివారం మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆకుల సతీష్‌కు మూడు సార్లు వివాహం కాగా ఏ ఒక్క భార్య కాపురం చేయలేదు. ఇటీవల సతీష్ పక్షవాతానికి గురికాగ, తండ్రి సాయిలు అడి బాగోగులు చూస్తున్నాడు. ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవటానికి డబ్బులు లేకపోవడం, ఇతర సమస్యలు తోడు కావటంతోనే తండ్రీకొడుకులు మనస్తాపం చెంది ఈ ఘాతుకానికి పాల్పడినట్టు గ్రామస్తుల ద్వారా తెలిసింది.